

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి బుధవారం సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని పలు రకాల సమస్యలపైన సబ్ కలెక్టర్‌తో చర్చించానని మేడా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు యోగేశ్వర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ చిదానంద గౌడ్, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, మందరం గంగిరెడ్డి, విశ్వనాథరాజు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

పనిచేయని 2డి ఎకో!

- 10 రోజులుగా హృద్రోగ పరీక్షలకు బ్రేక్
- ఆందోళనలో హార్ట్ పేషంట్లు
- పట్టని జిజిహెచ్ అధికారులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వజన ఆస్పత్రిలోని 2డి ఎకో పరికరం పనిచేయడం లేదు. 10 రోజులుగా జిజిహెచ్ ఆస్పత్రిలో హార్ట్ పేషంట్ల పరీక్షలు నిలిచిపోయాయి. జిజిహెచ్ రేడియాలజీ డిపార్టుమెంట్‌లో 2డి ఎకో పరికరంతోపాటు హృద్రోగులను పరీక్షించే ప్రోబ్ పరికరం అందుబాటులో ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడంలో జిజిహెచ్ యంత్రాంగం నిర్లక్ష్యం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిజిహెచ్‌కు వచ్చే హార్ట్ పేషంట్లు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్ల దీయాల్సిన దుస్థితి దాపురించింది. సాధారనంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోజుకు సుమారు 10 నుంచి 12 మంది హార్ట్‌పేషంట్లు 2డి ఎకో పరికరంతో పరీక్షలు చేయించుకుంటున్నట్లు జిజిహెచ్ ఉన్నతాధికారులు చెబుతుండడం గమనార్హం. ఎకో పరికరం ఆధారంతో దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా కాలం వెళ్ల దీస్తున్న హృద్రోగుల్లో భయాందోళన నెలకొంది. కడప నగరంలోని ప్రయివేటు ఆస్పత్రులకు హృద్రోగులు పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కొక్కరు సుమారు రూ.1500 నుంచి రూ.2000 వరకు వెచ్చించాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతటి పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించి 2డి ఎకో పరీక్ష చేయించుకునే స్తోమత లేనిపలువురు హార్ట్‌పేషంట్లు జిజిహెచ్ వైపే ఆశగా ఎదురు చూస్తుండడం గమనార్హం. ఇటువంటి అభాగ్యుల పట్ల ఎంతో ప్రేమా దరణలతో వ్యవహరించాల్సిన జిజిహెచ్ అధికార యంత్రాంగం నిద్రావస్థలో జోగుతుండడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి ఎంఐసియులోని ఎకో పరికరానికి మరమ్మతులను పూర్తి చేసే వరకై నా రేడియాలజీ డిపార్టుమెంట్‌లో ఉన్నటువంటి 2డి ఎకో, ప్రోబ్ పరికరాలను ఏర్పాటు చేసి రోగులను ఆందోళనలకు తెరదించాల్సిన అవసరం అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.



జిజిహెచ్‌లో పనిచేయని 2డి ఎకో మిషన్

మరమ్మతునకు ప్రయత్నం

జిజిహెచ్‌లో నెల రోజుల కింద ఎకో పరికరం మరమ్మతులకు గురైంది. మరమ్మతు చేయడానికి సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఉన్నతాధికారులతో మాట్లాడిన అనంతరం టెక్నీషియన్‌ను పిలిపించి మరమ్మతు చేయిస్తాం. అంత వరకు హార్ట్ పేషంట్లకు ప్రయివేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద పరీక్షలు చేయించే ఏర్పాట్లు చేస్తాం.

- కె.వి.వి వెంకటేశ్వరరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్, కడప.

కోదండరాముని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఏప్రిల్ 5న స్వామివారి కల్యాణోత్సవం
- ముఖ్యమంత్రిచే పట్టు వస్త్రాల సమర్పణ
- సమీక్షా సమావేశంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 30వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన అధికారులతో కలసి క్షేత్రస్థాయిపరిశీలన, సమీక్ష జరిపారు. అనంతరం వీరబ్రహ్మం మాట్లాడుతూ మార్చి 30వ తేదీ సాయంత్రం అంకురార్పణతో శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ శ్రీ కోదండరాముడి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే సమీక్ష జరిపి అనేక సూచనలు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు, స్వామివారి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. నెలరోజుల ముందు నుంచే టిటిడి ఈ పనులను ప్రారంభించిందన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, వాటిలోకి భక్తులను అనుమతించాల్సిన విధానం, భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష జరిపామన్నారు. గ్యాలరీల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికీ ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి రెండు వారాల్లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో టిటిడి చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు విద్యుత్ విభాగం ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, డిప్యూటీ ఇఒలు గుణభూషణ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఇఇ సుమతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డిఎఫ్ఒ శ్రీనివాస్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డిఇ చంద్రశేఖర్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి రామరాజు పాల్గొన్నారు. అంతకు ముందు జెఇఒ వీరబ్రహ్మం రాజంపేటలోని 108 అడుగుల శ్రీతాళ్ళపాక అన్నమాచార్య విగ్రహం ఆవరణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.


కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెఇఒ వీరబ్రహ్మం


మాట్లాడుతున్న రజక సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగయ్య

దేవాలయ బోర్డుల్లో రజకులకు ప్రాధాన్యతనివ్వాలి

-రజక సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు ముసలికుంట నాగయ్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్థికంగా వెనుకబడ్డ రజకులు జీవనోపాధిని కొనసాగించేందుకు ప్రభుత్వం సహాయ, సహకారాలు అందించాలని రజక సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు ముసలికుంట నాగయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం రజక సంఘం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకాల్లో రజకులకు అవకాశం కల్పించాలని కోరారు. ఇటీవల గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారిని 610 దేవాలయాల బోర్డుల్లో అవకాశం కల్పించడం హర్షణీమన్నారు. తరతరాల నుండి రజకులు పలు ఆలయాల్లోని తమ వృత్తిని కొనసాగిస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆలయ బోర్డులో తమకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. నాయీ బ్రాహ్మణులకు రాజకీయ చైతన్యం ఎక్కువని,దీంతో వారు అనుకున్న లక్ష్యాలను చేరుకుంటున్నారని,అదే చైతన్యం రజకుల్లో రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. టిటిడి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో దోబి పనులను రజకులకు అప్పగించాలని, ఇందులో మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించాలన్నారు. జిల్లాను యూనిట్‌గా ప్రభుత్వం తీసుకొని రజకులకు జీవనోపాధికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, వృత్తి నిర్వహణకు అవసరమైన యంత్ర పరికరాలను అందజేసి ఆదుకోవాలన్నారు. మనిషి పుట్టుక నుండి మరణం వరకు అన్ని కార్యక్రమాల్లో రజకులు పాత్ర క్రియా శీలకంగా ఉంటుందని గుర్తు చేశారు. రజకులు జీవనస్థితిగతులను ప్రభుత్వం పరిగణలోనికి తీసుకొని ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామ్మూర్తి, విజయమ్మ, గోపాల్, రమణలు పాల్గొన్నారు.

ఎగువ భద్రతో 'సీమ'కు తీవ్ర అన్యాయం

కడప అర్బన్: తుంగభద్ర డ్యామ్ పైభాగంలో ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి బిజెపి ప్రభుత్వం రూ.5,300 కోట్ల నిధులను విడుదల చేసి రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని కడప జిల్లా అఖిలపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం-రాయలసీమ నీటి సమస్యలు అంశంపైన ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, లోక్‌సత్తా పార్టీ నాయకులు కృష్ణయ్య, బిఎస్‌పి నాయకులు గుర్రప్ప, కాంగ్రెస్ నాయకులు సత్తార్ హాజరై ప్రసంగించారు.


ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రమేష్‌రెడ్డి

ప్రజాగ్రహంతో కాలగర్భంలో కలిసిపోనున్న వైసిపి : ఆర్ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజాగ్రహంలో వైసిపి ప్రభుత్వం కాలగర్భంలో కలిసిపోనుందని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేస్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నముక్కపల్లెలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు సక్రమంగా లేవని గుంతలమయమైన రోడ్లు ఉన్నాయని, పెంచిన నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు వల్ల పేదవారి నడ్డి విరుస్తున్నదని విన్నవించారు. అనంతరం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హయాంలో పేద ప్రజలు సుఖంగా జీవించాలని వారి కొరకు అహర్నిశలు కష్టపడుతూ సరుకుల ధరలు పెంచకుండా, బ్లాక్ మార్కెట్ తరలించకుండా కట్టడి చేశారన్నారు. ప్రజలందరూ ఓటు ద్వారా గుణపాఠం చెప్పి అవినీతి దుర్మార్గపు ప్రభుత్వాన్ని కాలగర్భంలో కలపాలన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్‌వల్లి, రాజంపేట పార్ల మెంట్ అధికార ప్రతినిధి వతన్ నిస్సార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌కె.హుసేన్, బూత్ కన్వీనర్ విశ్వేశ్వర్, లోకేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సర్దార్ వలిఖాన్, సుధాకర్, షేక్ ఇక్బాల్ బాష, బసయ్య, న్యూ ఆంధ్ర ముబారక్ అత్తర్ జావిద్, శేషి జాబీర్, మహబూబ్ అలీఖాన్, సోనిరాజ్ కలీమ్, రాయచోటి ఆర్గనైజింగ్ సెక్రటరీ సబూద్‌సయ్యద్ అబీద్, జావిద్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు మొండిచేయి

మదనపల్లె అర్బన్: విదేశీ విద్యా దీవెన పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులను ప్రభుత్వం మోసం చేసిందని టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్ ఆరోపించారు. బుధవారం స్థానిక మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, జాతిపిత విగ్రహం వద్ద నినాదాలు చేసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు విదేశాల్లో చదువు కునేందుకు వీలుగా గత ప్రభుత్వాలు విదేశీ విద్య పథకాన్ని ప్రారంభించాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశీ విద్య పథకాన్ని మూడున్నరేళ్లుగా నిలిపివేసిందన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మోడెం సిద్ధప్ప, బెస్త సాధికార జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, బిసి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు నాగయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబు, వెంకటేష్, మహిళా నాయకురాలు విజయమ్మ,మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్ ఖాన్, బావజాన్, రామ్మూర్తి, గోపాల్, శ్రీరాములుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఆహార భద్రత చట్టం అమలు

- ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ఆహార భద్రత చట్టం-2013ను పటిష్టంగా అమలు చేయాలని ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జాతీయ ఆహార భద్రతపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6, 7వ తేదీలలో రెండు రోజుల పాటు రైల్వే కోడూరు, పుల్లంపేట, పెనగలూరు, నందలూరు, రాజంపేట, లకిరెడ్డిపల్లె, సంబేపల్లి, గుర్రంకొండ మండలాలలోని చౌక దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్స్, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు పరిశీలించానని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం పంపిణీ, చౌకదుకాణాల ద్వారా నిత్యవసరాల పంపిణీకి సంబంధించి అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని వీటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. ఎపి స్టేట్ ఫుడ్ కమిషన్, జాతీయ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ 2013కు లోబడి పనిచేస్తున్నారు. ఈ యాక్ట్ నియమ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం సరఫరా, చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ సక్రమంగా జరగకపోతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పౌరసరఫరాల అధికారులు తగు పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తోందని విద్యార్థులకు మెనూప్రకారం భోజనం ఇవ్వాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. రక్తహీనతతో బాధపడే వారందరికీ కోడిగుడ్లు, పౌష్టికాహారం అందేటట్లు చూడాలన్నారు. పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఐసిడిఎస్ అధికారులకు ఉచించారు. వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం క్రమం తప్పకుండా భోజనం ఇవ్వాలన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యవసరాల పంపిణీలో సమస్యలు తలెత్తినట్లయితే సహించేదలేదని హెచ్చరించారు. జిల్లాలోని అంగన్వాడీ సెంటర్లు, చౌక దుకాణాలు, వసతి గృహాలలోని సమస్యలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ తమీంమ్ అన్సారీయ మాట్లాడుతూ జిల్లాలో 54 వసతి గృహాలు ఉన్నాయన్నారు. ప్రతి వసతి గృహానికి ఒక నోడల్ ఆఫీసర్ను నియమించామన్నారు. వీరు హాస్టల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించు కోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై వైద్యాధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ, అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇకనుంచి అంగన్వాడి కేంద్రాలు చౌకదుకాణాలు తరచూ విజిట్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపి ఫుడ్ కమిషన్ సహాయ సంచాలకులు పి.సురేష్, డిఎస్ఒ రఘురాం, డిఇఒ రాఘవరెడ్డి, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ ధనలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డిడి జాకిర్ హుస్సేన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన విజయ ప్రతాప్‌రెడ్డి

ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్‌రెడ్డి కలెక్టర్ గిరీషకు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి జిల్లాలో రెండు రోజులుగా వివిధ మండలాలలోని చౌకదుకాణాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఎంఎల్ఎస్ పాయింట్స్, వసతి గృహాలను విజిట్ చేసి అక్కడ గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులకు సూచించడం జరిగిందని ఆయన కలెక్టర్‌కు తెలిపారు.

ఫేస్ యాప్ రద్దుకు 14న ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ముఖ ఆధారిత హాజరు నుంచి విఆర్ఎలను మినహాయించాలని, యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.చంద్రశేఖర్, ఎ.రామంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ విఆర్ఎలలో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు లేవని, వారిలో చాలా మంది నిరక్ష్యరాస్యులు కావడం చేత యాప్ వినియోగం తెలియదని పేర్కొన్నారు. కొందరు గ్రామీణ ప్రాంతాల వారికి నెట్ వర్క్ సమస్య కూడా ఉందని తెలిపారు. విఆర్ఎలకు రోజువారి పనికి సంబంధించిన హాజరు విధానంలో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు విఆర్ఎ జీతాలతో పాటు ఉద్యోగాలకు ఎసరు పెట్టే ప్రమాదం దాగిఉందని ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. విఆర్ఎలకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, డిఎతో కలిపి వేతనం చెల్లించాలని, నామినీలను విఆర్ఎలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్స్ ఇవ్వాలని, 65 ఏళ్లు దాటి చనిపోయిన విఆర్ఎ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్స్‌తో ధర్నా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలన్ని విఆర్ఎలకు వర్తింపచేయాలన్నారు. ధర్నా కార్యక్రమంలో గ్రామ సేవకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు


మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

భద్రత కోసం హెల్మెట్, సీటు బెల్టు ధరించండి : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

వాహనదారులకు హెల్మెట్, సీటు బెల్టుపై అవగాహన కల్పించాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. బుధవారం పోలీసు అధికారులతో డిపిఒ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్టు, డ్రంకన్ డ్రైవ్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా హెల్మెట్, సీటు బెల్టు లేని వారిపై, డ్రంకన్ డ్రైవ్ వారికి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 1860 ఇ-చలానాలు, ఆరు డ్రంకన్ డ్రైవ్ కేసులను నమోదు చేశామన్నారు. ఒక క్షణం చిన్న ఏమరపాటు మనపై ఆధారపడిన కుటుంబాన్ని రోడ్డుపాలు చేస్తుందని తెలిపారు. కొంచెం దూరమే కదా అని ద్విచక్ర వాహనంపై హెల్మెట్‌ను, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్టును విస్మరిస్తే తిరిగి కోలుకోలేనంతగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రహదారి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఎంతో విలువైన ప్రాణాలను సురక్షితంగా కాపాడుకోవచ్చని తెలిపారు. రహదారి ప్రమాదాల నియంత్రణలో భాగంగా గత వారం రోజులుగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్, సీట్ బెల్టు ధరించని వారిని గుర్తించి, వారిని నిలువరించి, హెల్మెట్, సీట్ బెల్టు వాడకపోవడం వల్ల జరిగే పరిణామాలు, ఎదురయ్యే ప్రమాదాల గురించి వివరించాలని పేర్కొన్నారు. నేటి కాలంలో సంభవిస్తున్న మరణాలను పరిశీలిస్తే రహదారి ప్రమాదాలలో చనిపోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన ఖాదర్‌ఖాన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 13వ రోజైన బుధవారం మదనపల్లి నియోజక వర్గానికి చెందిన మాజీ సర్పంచ్, తాజ్ హోటల్స్ అధినేత పఠాన్ ఖాదర్‌ఖాన్ యువగళంలో పాల్గొని యువనేత వెంట నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ యువగళానికి ప్రజల నుండి అపూర్వ సందన లభిస్తోందని కితాబునిచ్చారు. యువత, రైతులు, శ్రామికులకు భరోసానిస్తున్న ఆయన పాదయాత్రను సాగిస్తు న్నారన్నారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని,వారి సాధకబా ధలను ప్రత్యక్షంగా తిలకిస్తున్నారన్నారు. ప్రస్తుత అధికార పార్టీ అవలంబిస్తున్న విధానాలను ప్రజలకు వివరించే విధానం అద్భుతంగా ఉందన్నారు.


లోకేష్‌తో పఠాన్ ఖాదర్ ఖాన్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై పోరాటాలు : వ్య.కా.స

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

వ్యవసాయ కార్మికులు, పేదలకు వ్యతిరేకంగా ఉండే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయరామయ్య, పందికాళ్ళ మణి తెలిపారు.బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జాతీయ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ జాతీయ మహాసభలు ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు కోల్‌కత్తా నగరంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతుల్ని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేలా కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దుకు ఢిల్లీ నుండి గల్లీ దాకా సాగిన పోరాటాలలో సంఘం చురుకైన పాత్ర వహించిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నేడు దేశవ్యాప్తంగా 200 రోజులు పనిదినాలు కావాలని నేటి ధరలు కనుగొనగా రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యక్రాంతమైన వాటిని స్వాధీనం చేసుకొని పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొజ్జశివయ్య, ఆనందయ్య, చెంగయ్య, పెంచలయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు.

జెఇఇలో 'చైతన్య' విద్యార్థి లలిత ప్రతిభ

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో పదవ తరగతి వరకూ చదివిన రాయచోటి పట్టణానికి చెందిన సుగవాసి సుగుణ, వెంకట్ ప్రసాద్ కుమార్తె సుగవాసి లలిత జెఇఇ మెయిన్ 2023(సెషన్-1) ఫలితాలలో 99.63 శాతం మార్కులతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాపర్‌గా నిలిచింది. కడప డివిజన్ ఎజిఎం డి.రమణయ్య, ప్రాంతీయ సంచాలకులు పి.మహబూబ్ బాషా విద్యార్థిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 10వ తరగతి వరకూచదివి ఇదే విద్యాసంస్థలో ఇంటర్ పూర్తిచేసుకుని మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఆలిండియా ర్యాంకర్‌గా నిలవడం ద్వారా రాయచోటి కీర్తిని శ్రీచైతన్య విద్యా సంస్థల సామర్థ్యాన్ని జాతీయ స్థాయిలో మరో సారి రుజువు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ ఫలితం ద్వారా తాము తిరుగులేనిశక్తిగా నిలిచామని ఇలాంటి ఫలితాలు భవిష్యత్తులోనూ మరిన్ని పునరావృతం అవుతాయనే విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ బి.వి.ప్రసన్నకుమారి, జి.సుబ్బోజి, వి.శివార్జునరెడ్డి, కె.రాధిక, కో-ఆర్డినేటర్ కె.కుటుంబరావు, వైస్ ప్రిన్సిపల్స్ కె.జీవానందం, పి.ప్రతాప్, డీన్‌లు నాగనరేంద్ర, అల్లాబకష్, సురేష్, నాగార్జున, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి వరప్రసాద్, ప్రైమరీ ఇన్‌ఛార్జులు నస్రీన్, నాగప్రియ, శశికళ హేమలత, ఎఐలు, ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.





కృషి విజ్ఞాన కేంద్రంలో తమిళనాడు రైతులు

కెవికెను సందర్శించిన తమిళనాడు రైతులు

ప్రజాశక్తి-కలికిరి

అంతర్రాష్ట్ర సందర్శన యాత్రలో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని తిరువూరు జిల్లా రైతులు కెవికె ఆధ్వర్యంలోని ప్రకృతి వ్యవసాయ పంటలను సందర్శించారు. మొదటగా కె.వి.పల్లెలో ప్రకృతి పద్ధతిలో మామిడి సాగు చేస్తున్న రైతు శివతో కలిసి సేంద్రియ పద్ధతుల గురించి తెలుసుకున్నారు. మామిడి రైతు శివ పొలంలో పాటిస్తున్న పద్ధతులైన అమినాల్ పిచికారి, పండు ఈగ బుట్టల ప్రాముఖ్యతను, కొమ్మ కత్తిరింపుల గురించి తెలుసుకున్నారు. 8న అయ్యవారిపల్లిలో రైతు ఆనంద్ తన వరి పొలంలో పాటిస్తున్న సేంద్రియ పద్ధతుల గురించి క్షుణంగా వివరించారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు నూతన రకాలు, సేంద్రియ వ్యవసాయం, చిరు ధాన్యాల గురించి రైతులకు వివరించారు. వర్మీ కంపోస్టు, అజోల్ల, వ్యవసాయ యంత్రాలను రైతులు సందర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఐ.జ్యోతి, డాక్టర్ వై.పీరు సాహెబ్, డాక్టర్ కె.మాధురి, డాక్టర్ ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

28న శ్రీగంధం సాగుపై శిక్షణ

కలికిరి : ఈ నెల 28 కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శ్రీగంధం సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. 10న ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారితో కలిసి నిర్వహించాల్సిన శిక్షణ కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన 28వ తేదికి మార్పు చేసినట్లు చెప్పారు. రైతులు ఈ విషయం గుర్తించి శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన సాయిచంద్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వే కోడూరు పట్టణంలోని ఎస్వి జూనియర్ కళాశాలలో ఎంపిసి రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సాదు సాయిచందుకు జెఇఇ మెయిన్స్ ప్రవేశపరీక్షలో జనరల్ కేటగిరీలో 94.14శాతం సాధించాడని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎన్.శ్రీనివాసులు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయి చందు ఎంపిసి మొదటి సంవత్సరంలో 470కు గాను 457 మార్కులు సాధించాడని తెలిపారు. జెఇఇ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని ప్రిన్సిపల్‌తో పాటు డైరెక్టర్ ఎస్.వసుంధర, అధ్యాపక బృందం అభినందించారు.

అడవి పందుల నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి



కూలీని పరామర్శిస్తున్న సిఐటియు, వ్య.కా.స నాయకులు

మండల పరిధిలోని వైకోట గ్రామంలో పంట పొలాలను అడవి పందులు ధ్వంసం చేస్తూ, కూలీలపై దాడులు చేస్తున్నాయని అటవీ శాఖ అధికారులు వాటి నుంచి రక్షణ కల్పించాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘనాయకులు డిమాండ్ చేశారు. పంట పొలాల్లో పని చేస్తున్న యర్రా ఆంజనేయులు, బజారు నాగభూషణం, బోడా వేంకట సుబ్బయ్య, అల్లం మురళి, దండు అంకయ్యలపై దాడి చేసి గాయ పరిచాయని అన్నారు. గాయపడిన వారిని వీరిని సిపిఎం అనుబంధ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అద్యక్షులు ఎం జయరామయ్య , సిఐటియు మండల కార్యదర్శి వేంకటరమణ, కె.కేశవులు, రైతు సంఘం నాయకులు కె రత్తయ్య, చెంగయ్య, సి.హరిప్రసాద్‌లు పరామర్శించినారు. జిల్లా అద్యక్షులు జయరామయ్య మాట్లాడుతూ పందుల బెడద ఎక్కువ ఉందని పలుమార్లు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటి అధికారులు స్పందించి అడవి పందుల బారి నుంచి పంటలను, రైతులను కాపాడాలని కోరారు.



చిన్నపిల్లల గదులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రభుత్వ ఆస్పత్రిలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని కమ్యూనిటీ ఆస్పత్రిని బుధవారం కడప విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఉమామహేశ్వర ఆదేశాల మేరకు సిఐ రామకృష్ణ, ఎఐలు బాలగంగాధర్ రెడ్డి, రమేష్, గంగిరెడ్డిలు రిజిష్టర్ వార్డు, ఎక్స్‌రే గదులు, ఆపరేషన్, ల్యాబ్‌గది, కాన్పుల గది, చిన్నపిల్లల వార్డులను పరిశీలించారు. సకాలంలో అందిస్తున్న మందులు గురించి ఆరా తీశారు. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

లక్కిరెడ్డిపల్లె : ఈనెల 21, 22న జరుగనున్న అనంతపురం గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గంగమ్మ జాతర ఆలయాన్ని ఆయన సందర్శించి, జాతర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, మానవతా చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం, శివ శంకర్‌రెడ్డి, పూజారులు సుబ్బయ్య, రెడ్డిశేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ చిట్కాలపై అవగాహన

తంబళ్లపల్లి : స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో సంఘమిత్రలు సిసిలకు ఫిజియోథెరఫీ చిట్కాలపై అవగాహన సదస్సు జరిగింది. ఫిజియోథెరఫిస్ట్ సంతోష్ కుమార్ అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిని అధిక మిమించకుండ కండరాలు, కీళ్ల నొప్పుల కోసం పెయిన్ కిల్లర్ వాడటంతో కలిగే అనర్థాలు వివరించారు. ఇంటిలోనే మానసిక ఒత్తిడి, కీళ్ల, కండరాళ్ల నొప్పులు తగ్గించేందుకు ఫిజియోథెరపీ చిట్కాలను వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం గంగాధర్, సిసిలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సేవలు వినియోగించుకొని గ్రామీణ ప్రజల ఆర్థిక అభివృద్ధి సాధించాలని బ్యాంక్ చైర్మన్ ఎఎన్ఎస్ ప్రసాద్ కోరారు. బుధవారం తంబళ్లపల్లి లో సప్తగిరి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే సప్తగిరి గ్రామీణ బ్యాంకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతులకు ఖాతాదారులు పలు రకాల సబ్సిడీ రాయితీ, రుణాలు, వాహనాలు, స్థిరాస్తి, తనఖా పై రుణాలు, వాహనాలు కొనుగోలుకు వ్యవసాయ రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వయం సహాయ సంఘాలకు రుణాలు ఇస్తామన్నారు. విద్యార్థుల చదువు కోసం ఎడ్యుకేషన్ లోన్ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎం.ప్రసాద్, మేనేజర్ మోహన్, సరిత పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. రైల్వే కోడూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ సెంటర్‌ను సంస్థ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ రెడ్డి మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రాంత నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పన కొరకు ఎంతో ప్రయత్నం చేసి ఈ స్కిల్ హబ్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం చాలా సంతోష కరమన్నారు. ఈ శిక్షణలో నైపుణ్యాన్ని పెంచుకొని యువత ఉద్యోగులుగా రాణించాలని కోరారు. ఈ శిక్షణ 50 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.సుకుమార్ రెడ్డి, వైసిపి స్టీరింగ్ కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి

హేమన వర్మ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ సుధాకర్ రాజు, జడ్పిటిసి రత్నమ్మ, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.హరికృష్ణ, కె.రమేష్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీలక్ష్మి, స్థానిక స్కిల్ హబ్ బాధ్యులు సునీల్ కుమార్, పార్థసారథి, బుడగుంటపల్లె సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, వైసిపి నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించేందుకే గృహ సారధులు : 'మేడా'



జగనన్న కిట్ బ్యాగులను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలను అందించేందుకే గృహ సారథులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే మేడ వెంకట మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్ లకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు దుష్ప్రచారాన్ని చేస్తున్నాయని వాటిని తిప్పి కొట్టే విధంగా వాలంటీర్లు, గృహసారథులు పార్టీలకు అతీతంగా ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. తమ ప్రభుత్వం వస్తే వాలంటీర్ల వ్యవస్థను తొలగిస్తామని ప్రతిపక్ష నాయకులు చెబుతున్నారని ఇలాంటి వాటికి ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, వాలంటీర్లకు అండగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు, నాయకులంతా ఉంటామని, మనమందరము కలిసి తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నువ్వే మా నమ్మకం జగనన్న కిట్టు బ్యాగులను మండల సచివాలయ కన్వీనర్ కలీంకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కృష్ణమూర్తి, జడ్పిటిసి గడికోట ఉషా సుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, వైసిపి యువజన ప్రధాన కార్యదర్శి నడివీధి సుధాకర్, సర్పంచులు జంబు సూర్యనారాయణ, మైనుద్దీన్, నరసయ్య, నందలూరు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు అనుదీప్, వైసిపి నాయకులు తుమ్మల శ్రీధర్ గౌడ్, హిమగిరి నాథ్ యాదవ్, ఆర్ముగం విశ్వనాధ్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు విరివిగా రుణాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని సహకార బ్యాంకులో ఖాతా దారులకు విరివిగా రుణాలు అందజేస్తామని డిసిసిబి బ్రాంచ్ మేనేజరు వెంకట రమణ తెలిపారు. ప్రతి రైతుకి రెండు ఎకరాల భూమి పై గల రైతులకి రూ.8 లక్షలు రుణాలు మంజూరు చేస్తామని వారు తెలిపారు. ఏ బ్యాంకులో లేని వసతులు సహకార బ్యాంకులో ఉన్నాయని తెలిపారు. బ్యాంకులో నిల్వ ఉంచిన మొత్తం నగదుకు కూడా 7 శాతం వడ్డీ చెల్లిస్తామని వారు తెలిపారు. లోన్ తీసుకున్న రైతులకు 7 శాతం, బంగారంపై తీసుకునే ఖాతాదారునికి 9 శాతం వడ్డీతో రుణాలు అందిస్తాని పేర్కొన్నారు. సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించిన రైతులకి సన్మానించి ప్రశంసా పత్రం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్యాషియర్ శాలిని, సుబ్బారెడ్డి, దివ్య, లోకేశ్వర్, నాగార్జున పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** బ్యాంకులతో సమానంగా రుణ సేవలు తమ బ్యాంకు జిల్లా సహకార కేంద్రం లిమిటెడ్ అందిస్తున్నట్లు నోడల్ అధికారి షకీలా భాను పేర్కొన్నారు. 10న బుధవారం జిల్లా సహకార కేంద్ర లిమిటెడ్ 105వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఖాతా దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ తమ బ్యాంకులో డిపాజిట్లపై అత్యధిక వడ్డీ 333 రోజులకు 7.30 శాతం



పుల్లంపేట : కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజరు వెంకటరమణ

ఇస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్ డిపాజిట్లు పై అత్యధిక వడ్డీ 7.8 శాతాన్ని ఇస్తున్నామన్నారు. స్వయం సహాయక గ్రూపులకు రుణాలు, హౌసింగ్ రుణాలు, వెహికల్ రుణాలు, అన్ని రకాల రుణాలను అందిస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు అతి తక్కువ వడ్డీ 8.30 రుణాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అశోక్ కుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవి చంద్రబాబు

కలెక్షన్ సెంటర్ నిర్మాణాలు పూర్తిచేయండి

ప్రజాశక్తి -పెద్దమండ్యం

మండలం లోని కామధేను ఎఫ్‌పిఒ వారికి ఉద్యాన వన శాఖ ద్వారా మంజూరైనా రూ.15 లక్షలుతో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్ పనులను బుధవారం ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రవిచంద్ర బాబు తనిఖీ చేసి, పనులను పరిశీలించారు. పనులు పనితీరు, నాణ్యతను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ మాట్లాడుతూ ఎఫ్‌పిఒ ద్వారా రైతులకు ఎరువు అమ్మకాలు కూడా విక్రయించ వచ్చని, అలాగే నర్సరీ సౌకర్యం కల్పించవచ్చని ఆయన తెలిపారు. కలెక్షన్ సెంటర్ పనుల్లో వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు వరకు జరిగిన పనులుకో నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లి హెచ్‌ఒ తేజస్విని రెడ్డి, ఎఫ్‌పిఒసిఇఒ అమరనాథ్ రెడ్డి, అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి పెద్దరెడ్డప రెడ్డి , కోశాధికారి రఘురామి రెడ్డి, డైరెక్టర్ పి.నాగేశ్వరావు, కృష్ణ మూర్తి రెడ్డి సంఘ రైతులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** ఎఫ్‌పిఒ కలెక్షన్స్ సెంటర్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీచంద్రబాబు కోరారు. రూ. 15 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న ఎఫ్‌పిఒ కలెక్షన్స్ సెంటర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా త్వరితన పూర్తి చేయాలని హార్టికల్చర్ అధికారి తేజస్వికి సూచించారు. ఆయన వెంట సిఇఒ ప్రభావతి, ఎఫ్‌పిఒ అధ్యక్షులు, డైరెక్టర్లు ఉన్నారు.

వాల్మీకి భవనం భూమిపూజకు తరలిరండి

ప్రజాశక్తి-కురబలకోట

మదనపల్లె సమీపంలో బసినికొండ దగ్గర వాల్మీకుల స్థలంలో ఈ నెల 12న వాల్మీకి భవన్ భూమి పూజకు జిల్లాలోని వాల్మీకి కుటుంబ సభ్యులు తరలి రావాలని వాల్మీకి పెద్దలు నక్కా మహేష్, బసినికొండ చలపతి, తెట్టు చిన్నరెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దిగువబోయపల్లె, ఎగువబోయపల్లె, బాలప్పగారిపల్లె, వాల్మీకుల గ్రామాల్లో పర్యటించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కులానికి భవనాలు నిర్మించుకున్నారని, వాల్మీకులకు భవనాలు, కల్యాణ మండపాలు లేవన్నారు. మనమందరం కలిసి కట్టుగా ఉండి మదనపల్లెలో ఉన్న వాల్మీకి స్థలంలో భవనం నిర్మించుకుంటే భావి తరాలకు ఉపయోగపడుతుందన్నారు. వాల్మీకి భవన్ నిర్మాణానికి ఎంపీ మిథున్ రెడ్డి రూ.50 లక్షలు సాయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కుటుంబ సభ్యులు ఆంజనేయులు, మల్లికార్జున, నరసింహులు, గంగాధర్, రామమూర్తి, రామయ్య, ఈరప్ప, శంకర పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై జాగ్రత్తగా ఉండాలి

చాపాడు : హెచ్‌ఐవిపై అవగాహన అవసరమని పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మడూరులో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ హెచ్‌ఐవి అవగాహన ద్వారానే నియంత్రించ వచ్చన్నారు. హెచ్‌ఐవి సోకడం వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్ దర్బార్, వైద్య సిబ్బంది నారాయణరెడ్డి, ఎంపిహెచ్‌ఒ, ఎఎన్ఎం, సిబ్బంది సురేంద్ర, అమీర్, ప్రజలు పాల్గొన్నారు.

కూలీలు సిబ్బందికి సహకరించాలి

ప్రజాశక్తి - చాపాడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా జరిగిన పనులపై సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని జిల్లా విజిలెన్స్ అధికారి యోగానంద రెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద బుధవారం 2021-22 ఏడాదిలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఎస్ఆర్‌పి, డిఆర్‌పి, సామాజిక తనిఖీ బృందానికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి సిబ్బంది గ్రామాలలో తనిఖీ చేపడతారన్నారు. ఉపాధి కూలీలు సిబ్బందికి సహకరించాలన్నారు. సామాజిక తనిఖీ సిబ్బందికి ఎస్ఆర్‌పి తిరుమలేష్ సిబ్బంది తనిఖీ పై అవగాహన కల్పించారు. అందుకు సంబంధించిన పత్రాలను సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో ఎపిఒ పద్మారాణి, పిఆర్ ఎఇ ఈశ్వరయ్య, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

ప్రోత్సాహకంతో ఉత్సాహం నింపవచ్చు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు ప్రోత్సాహక పత్రాలు అందించడం వల్ల వారిలో చదువుతో పాటు మానసికంగా ఉత్సాహం నింపగలుగుతామని టికెఆర్ జీవన జ్యోతి హైస్కూల్ ఫౌండర్ గురుదేవ్ రామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో 'గ్రాడ్యుయేషన్ సెరిమోన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురుదేవ్ రామిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు వారు సాధించిన విజయాలకు గుర్తుగా పొందే పత్రమే గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ అన్నారు. క్రమశిక్షణ కల్గి ఉండడం వల్ల మంచి లక్షణాలు పొందవచ్చన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అమర్ నాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు డి. చిన్న గురు శేఖర్ ఉన్నత స్థాయివైపుగా విద్యార్థులను నడిపించడం మా పాఠశాల ప్రత్యేకతన్నారు. పిల్లలు సర్వతో ముఖాభివృద్ధి చెందేలా తీర్చిదిద్దే పద్ధతిలో గ్రాడ్యుయేషన్ సెరిమోని ఒకటన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు

ప్రజాశక్తి -ఖాజీపేట

గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ్ట మాల మహానాడు రాష్ట్రఉపాధ్యక్షుడు గున్నంపాటి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం మండల అధ్యక్షుడు కలిసి సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. స్థానికంగా ఉన్న సయ్యద్ నడిపి దస్తగిరి, సంధ్యారాణి ఉపాధి నిమిత్తం ఖాజీపేటలో నివసిస్తుండగా రేషన్ కార్డులో చిరునామా మార్పు కోసం సచివాలయానికి వెళ్తే సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆ మేరకు ఎంపిపి అబూబాకర్ సిద్ధిక్ దృష్టికి తీసుకెళ్లామనాన్రు. ప్రతి సచివాలయంలో ఉద్యోగుల తీరు విమర్శలకు తావిస్తుందని, ఉన్నతాధికారులు పట్టించుకో కపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు స్పందించి సచివాలయ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు కళాశాలలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. బుధవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు తమ కళాశాల నుంచి వర్ష, మురళి, మంజునాథ, సాయినాథ్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర ఎంపికైనట్లు చెప్పారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లో ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు హజరు అవుతున్నట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు హజరు కావడం సంతోషంగా ఉందన్నారు.



ఇదేం ఖర్మ కార్యక్రమంలో రమేష్ కుమార్ రెడ్డి

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన వైసిపి ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్నిస్మరించిందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె మండలం లోని ఎర్రగుడి పంచాయితీ చెంచర్లపల్లె, హరిజనవాడ, కాలనీ మూడిండ్లపల్లి, పుట్టకారవాండ్లపల్లి గ్రామాలలో పార్టీ కార్యకర్తలతో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిని గాలికి వదిలారని సర్పంచులకు వచ్చే నిధులను కూడా ప్రభుత్వం పలు రకాల దోపిడీలకు గురిచేస్తోందని ఆరోపించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా సర్పంచులకు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఏదో సాకు చెప్పి డబ్బులను స్వాహా చేస్తున్నారని ధ్వజమెత్తారు. మండల ప్రాదేశిక సభ్యులు ఉత్సవ విగ్రహాలుగా మారారని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలన్నీ కూడా రాష్ట్రంలో కుంటుపడ్డాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని అఖండ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కలాడి ప్రభాకర్‌రెడ్డి, యరంరెడ్డి, బండి రమణయ్య, శ్రీనివాసులు, చిన్నరెడ్డెయ్య, సాంబ శివనాయుడు, బాల సుబ్బారెడ్డి, ఖదీర్ సాబ్, ప్రసాద్, సర్పంచ్ కేశవ, జిలాన్, యూనిట్ ఇన్‌ఛార్జ్ రవిరెడ్డి, రమణయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, రమణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-కెవి పల్లి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ ఉషశ్రీ

మండలంలోని జిల్లెలమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల నూతన కాల్వ ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్ రికార్డులను, రిజిష్టర్‌ను పరిశీలించారు. కోవిడ్ వ్యాక్సినేషన్ వివరాలు, హైరిస్క్ గర్భవతుల నమోదు, ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించారు. హైరిస్క్ గర్భవతుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి బర్త్ ప్లాన్ ప్రకారం కాన్పునకు ఆసుపత్రికి తరలించాలని సూచించారు. కార్య క్రమంలో మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపిహెచ్ఇఒ శివారెడ్డి, ఎంవి హెచ్ఎస్ గీతకుమారి, జిల్లా కార్యాలయ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళను గాయపరిచిన ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

మహిళను గాయపరిచిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని బాటవారి పల్లి పంచాయతీ అక్కన్న గారి కోటకు చెందిన అలివేలమ్మకు సంబంధించిన చింత చెట్టును, అదే గ్రామానికి చెందిన తిరుపతి, అతని కుమారుడు నవీన్, నవీన్ భార్య సుజాత కలిసి చింత చెట్టును నరికి వేయడంపై అలివేలమ్మ నిలదీసి అడిగింది. ఇందుకు అలివేలమ్మను దుర్భాషలాడి, చేతులతో కొట్టి గాయాలు చేశారు. ఈ మేరకు అలివేలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ మల్లిక తెలిపారు. సిఐ కథనం మేరకు.. పెద్ద తిప్పసముద్రం మండలం, సంపతికోట మలువు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓవ్యక్తి వాహనంలో వేగంతో వస్తుండగా అనుమానంతో వాహనాన్ని ఆపామని తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేయగా మదనపల్లెకు చెందిన రామకృష్ణగా గుర్తించి, అతని వద్ద నుంచి 80 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-కలకడ



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్, అరెస్టయిన వ్యక్తితో పోలీసులు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌ను డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కెవి. పల్లి మండలంలోని జిల్లెల్ల మంద గ్రామానికి చెందిన రెడ్డినాయక్ కుమారుడు బాలాజీ నాయక్ జర్రిగడ్డ గ్రామానికి తూర్పు వైపున ఉన్న బహుదానదిలో ట్రాక్టరులో ఇసుక నింపుకొని, కలకడలో ఎక్కువ లాభానికి అమ్ముకొనుటకు వస్తుండగా బాలయ్యగారిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లి వద్ద పట్టుకున్నామని తెలిపారు. అతనికి ఇసుక రవాణాకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేనందున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాసులు, రాజేంద్ర, మహబూబ్ బాషా, హోంగార్డు నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు తమిళ స్మగ్లర్లు అరెస్టు

ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల పరిధిలోని బాలుపల్లె రేంజి అటవీశాఖ పరిధిలో ఇద్దరు తమిళ ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు బాలు పల్లె డిఆర్ఒఎస్ చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలు పల్లె రేంజి బాలుపల్లె పశ్చిమ బీటు లో సోదాలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన సౌందర్య రాజ్,అన్నామలై రమేష్ అనే ఇరువురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 42 వేల రూపాయలు విలువచేసే ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని తిరుపతి ఎర్రచందనం కోర్టు నందు హాజరు పరిచామని ఆమె తెలిపారు. ఈ తనిఖీలలో బాలపల్లె ఎఫ్‌బిఒ ఎం.సుధాకర్, ఎబిఒ ఎ.సుబ్బారెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారని ఆమె తెలిపారు.



స్వాధీనం చేసుకున్న దుంగలు,అరెస్టయిన తమిళ స్మగ్లర్లతో అటవీశాఖ అధికారులు